క్లుప్తంగా

మధ్యాహ్న భోజనం రుచిగా ఉండాలి



మధ్యాహ్న భోజనం తనిఖీ చేస్తున్న ఎంఈఓ

దక్కిలి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పెట్టే మధ్యాహ్న భోజనం రుచికరంగా, శుభ్రంగా ఉండాలని ఎంఈఓ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని డి.వడ్డిపల్లి, అంబేడ్కర్ నగర్, వెంబులూరు, కమ్మపల్లి ప్రాథమిక పాఠశాలలను గురువారం ఆయన సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు తయారు చేస్తున్న వంటను రుచి చూశారు. మెనూ ప్రకారం నాణ్యత ప్రమాణాలు ఉండాలని నిర్వాహకులకు సూచించారు. పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చదువులో వెనుకబడి ఉన్న విద్యార్థులపై శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు తెలియజేశారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పరిశీలించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

పాలకవర్గాన్ని రద్దు చేయాలని ఫిర్యాదు

కలువాయి: కలువాయి చెరువు మత్స్య సహకార సంఘం ప్రస్తుత పాలకవర్గాన్ని రద్దు చేయాలని పలువురు సంఘ సభ్యులు గురువారం సంఘ మహాజన సభలో అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కలువాయి అంకమ్మతల్లి గుడి వద్ద మత్స్య సహకార సంఘం సర్వజన మహాజన సభను అధికారులు నిర్వహించారు. కావలి మత్స్య శాఖ సహాయ సంచాలకులు ఎస్.శ్రీనివాసులు, నెల్లూరు సహాయ సంచాలకులు వి.రంగనాథబాబు హాజరయ్యారు. సంఘంలో మొత్తం 140 మంది సభ్యులు ఉండగా 86 మంది హాజరయ్యారు. ప్రస్తుతం సంఘానికి ఉన్న పాలకవర్గం సంఘ సమావేశాలు నిర్వహించడం లేదని, రికార్డులు సరిగా లేవని, ఈ విషయాలపై అధికారులు విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని సభ్యులు అధికారుల దృష్టికి తెచ్చారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని వారు తెలిపారు.

పండ్ల తోటల పెంపకంపై దృష్టి సారించాలి



రాపూరులో మాట్లాడుతున్న పీడీ శ్రీనివాసులు

రాపూరు: మండలంలోని రైతులు పండ్లతోటల పెంపకంపై దృష్టి సారించాలని డ్వామా పీడీ శ్రీనివాసులు అన్నారు. రాపూరు మండల పరిషత్ కార్యాలయంలో రైతులు, ఉపాధిహామీ, హార్టీ కల్చర్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం ద్వారా ప్రభుత్వం నిమ్మ, మామిడి, సపోట, జామ తోటలు పెంచేందుకు నిధులు సమకూరుస్తుందన్నారు. అవసరమైన రైతులు తాము ఏ పంట పండించుకుంటారో అధికారులకు దరకాస్తు చేసుకోవాలని కోరారు. మండలంలో 300 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం చేపట్టాలన్నారు. రైతులకు అవసరమైన మొక్కలు, గుంటలు చేసేందుకు, ఎరువులకు ఉపాధిహామీ పథకం ద్వారా మూడు సంవత్సరాలకు రూ.1.07 లక్షల వరకు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీ మృదుల, హార్టీ కల్చర్ అధికారి లక్ష్మీ మిథిల, ఎంపీడీఓ ఏడుకొండలు, ఏపీఓ సుబ్బరాయులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.1 లక్ష విరాళం

నాయుడుపేట టౌన్: విజయవాడ వరద బాధితులకు పట్టణానికి చెందిన పారిశ్రామికవేత్త పెసల జయరాజగోపాల్ కుటుంబ సభ్యులు రూ.1 లక్ష విరాళాన్ని గురువారం మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంకు అందించారు. సీఎం రిలీఫ్ ఫండ్ పేరిట తీసిన డీడీని పట్టణంలోని నెలవల నివాసం వద్ద ఆయనతోపాటు మాజీ ఏఎంసీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డికి అందించారు. కార్యక్రమంలో పెసల కిషోర్‌బాబు, రమేష్‌బాబు తదితరులు ఉన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

చిల్లకూరు: మండలంలోని చేడిమాల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి రొయ్యల గుంట వద్ద పని చేసుకుంటున్న సమయంలో ప్రమాదవశాత్తు తూము వద్ద పడి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స చేయించుకునేందుకు ఆర్థిక స్తోమత లేక పోవడంతో రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు ద్వారా రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. చేడిమాల గ్రామానికి చెందిన యనమల ప్రభాకర్ అనే వ్యక్తి తిక్కవరం సమీపంలో ఉన్న రొయ్యల గుంట వద్ద ప్రమాదవశాత్తు పడి కాలు విరిగింది. వైద్య ఖర్చులకు ట్రస్టు ప్రతినిధులను సంప్రదించారు. దీంతో ట్రస్టు నిర్వాహకులు ముందుకు వచ్చి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.20 వేలు అందించారు. ట్రస్టు ప్రతినిధులు బాబు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ వినియోగంపై విద్యార్థులకు అవగాహన

దొరవారిసత్రం: మావిళ్లపాడు గ్రామ పరిధిలోని ఆదర్శ పాఠశాలలో గురువారం స్థానిక ఎస్‌ఐ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో హెల్మెట్ వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ, ప్రిన్సిపల్ సుమలత మాట్లాడుతూ బైక్‌లు నడుపుతున్న సమయంలో ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలన్నారు. ఈ విషయం ప్రతి విద్యార్థి వారి వారి తల్లిదండ్రులకు తెలియజేసి చైతన్యం తీసుకువచ్చేందుకు కృషి చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.

వైద్య విద్యపై నిర్లక్ష్యం తగదు



కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో వైద్య కళాశాలలకు అనుమతులు తెచ్చుకోవడంలో పూర్తిగా విఫలమైంది. దీనిని కప్పిపుచ్చుకోవడం కోసం తాము అధికారంలోకి వచ్చి మూడు నెలలే అవుతోందని బుకాయిస్తున్నారు. వంద రోజుల్లో అద్భుతాలు చేశామని చెప్పేవారు వైద్య విద్య కోసం కొంత వెచ్చించే అవకాశం లభించ లేదా? పులివెందుల మెడికల్ కాలేజీకి నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఫీజిబులిటీ ఇచ్చినా అక్కడ తరగతులు ప్రారంభించలేమని చెప్పడం శోచనీయం. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో ఈ విద్యా సంవత్సరంలో దాదాపు 400 మెడికల్ సీట్లు కోల్పోవాల్సి వచ్చింది. ఇది పూర్తిగా ప్రభుత్వ వైఫల్యమే.

- సి.సుధాకర్‌రెడ్డి, ఏపీ రైతు సంఘం కన్వీనర్, తడ



ప్రతిభావంతులకు నష్టం



గత ప్రభుత్వం రాష్ట్రంలో మెడికల్ కళాశాలలు మంజూరు చేసింది. కొన్ని నిర్మాణాలు పూర్తి చేసుకున్నాయి. ఈ సంవత్సరం అడ్మిషన్లు చేపట్టాల్సి ఉంది. పేద విద్యార్థుల సీట్లు తెచ్చుకుని డాక్టర్ కల సాకారం చేసుకునే వీలుంటుంది అయితే కొత్త ప్రభుత్వం కళాశాలలను ప్రారంభించకుండా ప్రైవేటీకరించేందుకు పూనుకుంది. ఇదే జరిగితే ప్రతిభ చూపిన విద్యార్థులకు అవకాశాలు దక్కవు. ఫలితంగా డాక్టర్ కావాలనే కల అందని ద్రాక్షగానే మారుతుంది. అందుకే మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ప్రభుత్వం తిరిగి పరిశీలించాలి.

- మెంటా శ్రీనివాసులు, ఇంటర్మీడియెట్ విద్యార్థి తండ్రి, రాపూరు

ప్రమాదాలకు నిలయంగా మలుపులు

- తుప్పు పట్టిన సూచికబోర్డులు
- పట్టించుకోని అధికారులు

ఓజిలి: అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో గ్రామీణ ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు ఆగడం లేదు. వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. మండల పరిధిలోని పెదపరియ క్రాస్ నుంచి మొదలు పెదపరియ, చిలమానుచేను, ఆర్మేనిపాడు, వజ్జావారిపాళెం, ఇనుగుంట గ్రామాలకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారులలో మలుపులు అధికంగా ఉన్నాయి. ఈ మలుపులు ఎల్, ఎస్ ఆకారంలో ఉండడంతో వాహన చోదకులు ప్రమాదాల పాలవున్నారు. రహదారులకు చుట్టుపక్కలా కంప్రతుమ్మ చెట్లు ఎక్కువగా రోడ్డును కమ్మేస్తున్నాయి. ఈ క్రమంలో రాత్రి సమయాల్లో వాహన చోదకులు ఎదురుగా వస్తున్న వాహనాలు కనబడడడంలేదు. నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల ఆర్మేనిపాడు గ్రామంలో ఓ మలుపు వద్ద ద్విచక్ర వాహనం రోడ్డు ప్రమాదానికి గురై ముగ్గురు విద్యార్థులు మత్యువాత పడ్డారు. రోడ్డు మలుపుల వద్ద అధికారులు ఇరవయ్యేళ్ల కిందట సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సూచిక బోర్డులు పిచ్చి మొక్కలు కమ్మేసి తుప్పు పట్టిపోయి ఉన్నాయి. వాహనదారులకు రోడ్డు మార్గం తెలిపే విధంగా బోర్డులు కనబడకపోవడంతో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. అయితే అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవని వాహనదారులు వాపోతున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు తొలగించి మలుపుల వద్ద కొత్త సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



గుర్రంకొండ గ్రామం వద్ద ప్రమాదకరంగా మలుపు (ఇన్‌సెట్) పిచ్చి మొక్కలతో తుప్పు పట్టిపోయిన సూచిక బోర్డు

కూటమి పాలన అవినీతిమయం



కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి

పెళ్లకూరు: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వంద రోజుల కూటమి పాలన అవినీతిమయమని మాజీ డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి అభివర్ణించారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి సభ్యులు చెప్పిన సూపర్‌సిక్స్ పథకాల్లో కనీసం ఒక్కటి కూడా సక్రమంగా అమలు చేయలేదన్నారు. గడిచిన వంద రోజుల్లో లక్షన్నరకు పైగా పింఛన్లు తొలగించిన ఘనుడు చంద్రబాబు అని మండిపడ్డారు. వందరోజుల పాలనలో రూ.45వేల కోట్లు అప్పు చేయడంతోపాటు వరద బాధితులకు పిడికెడు మెతుకులు అందివ్వలేదన్నారు. కూటమి పాలనలో ఇప్పటికే 50 మందిని పొట్టన పెట్టుకున్నట్లు ఆరోపించారు. ఎన్నడూ లేని విధంగా జగనన్న రాష్ట్రానికి 18 మెడికల్ కళాశాలు తీసుకొచ్చారని, అయితే వాటిని ప్రైవేట్ పరం చేయడం చంద్రబాబు దుర్మార్గానికి పరాకాష్ట అన్నారు. నిత్యావసర ధరలు ఆకాశానికి ఎక్కడం మరో భారమన్నారు. నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పిన కూటమి నేతలు మాట నిలబెట్టు కోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వంద రోజుల టీడీపీ పాలన అట్టర్‌ఫ్లాప్ అనే విషయాన్ని రాష్ట్ర ప్రజలంతా బాహాటంగా విమర్శిస్తున్నట్లు చెప్పారు.

నేటి నుంచి స్కూల్‌గేమ్స్ జట్లు ఎంపిక

సైదాపురం: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వివిధ క్రీడా పోటీలకు ఎంపిక శుక్రవారం మండల కేంద్రమైన సైదాపురం ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు ఎంఈఓ దయాకర్‌రావు గురువా రం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడు తూ 68వ టోర్నమెంట్‌కు సంబంధించి మండలంలోని తొమ్మిది ఉన్నత పాఠశాలలకు చెందిన క్రీడాకారులను ఎంపిక చేస్తామన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ షెడ్యూల్ ప్రకారం ముందుగా మండల స్థాయి టోర్నమెంట్ నిర్వహించి ఎంపికైన క్రీడాకా రులు నియోజకవర్గస్థాయిలో పాల్గొంటారన్నారు.

నేడు స్కూల్‌గేమ్స్‌కు క్రీడాకారుల ఎంపిక

చిల్లకూరు: మండల స్థాయిలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారుల ఎంపికలను శుక్రవారం చిల్లకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ఎంఈవోలు సనత్‌కుమార్, ఎండీ రవూఫ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినీవిద్యార్థులు పోటీల్లో పాల్గొనాలని కోరారు. ఎంపికల్లో ప్రతిభ చూపిన వారిని నియోజకవర్గ స్థాయిలో జరిగే పోటీలకు పంపిస్తామని తెలిపారు.

ఐటీఐ కళాశాలలో ప్రవేశం కోసం దరఖాస్తుల స్వీకరణ

తడ: ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో 2024 విద్యా సంవత్సరానికి నాలుగో విడత ప్రవేశం కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ దేవదానం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ వెబ్‌సైట్‌లో ఈ నెల 26వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 27వ తేదీన వెరిఫికేషన్, 28వ తేదీన కౌన్సెలింగ్ జరుగుతుందని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు 79935 68224 నంబరుకి ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు.

ఆటో బోల్తా.. నలుగురికి గాయాలు

నాయుడుపేట టౌన్: మండల పరిధిలోని ద్వారకాపురం గ్రామ సమీపంలో రహదారిపై గురువారం రాత్రి ఆటో అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న నలుగురికి గాయాలయ్యాయి. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వాకాడు ప్రాంతానికి చెందిన కొంత మంది రెండు ఆటోలలో వెంకటగిరి దర్గాకు వెళుతున్నారు. మార్గ మధ్యలో ద్వారకాపురం గ్రామ సమీపంలో ముందు వెళుతున్న ఆటోకు అడవి పంది అడ్డు రావడంతో దానిని ఢీకొని రోడ్డుపై బోల్తా పడింది. ఆటోలో ఉన్న వాకాడు ప్రాంతానికి చెందిన కాలేషా, షేక్ సుమీయా, నిరజ, మరొకరికి గాయాలయ్యాయి. వీరిని 108 అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు వైద్యశాల వద్దకు వచ్చి బాధితులతో మాట్లాడి, విచారణ చేస్తున్నారు.

బ్రిక్స్ పరిశ్రమలో రూ.2.16 కోట్లు మోసం

నాయుడుపేట టౌన్: మేనేజర్‌గా పనిచేస్తూ దొంగ బిల్లులు సృష్టించి రూ.2.16 కోట్లు స్వాహా చేసిన వ్యక్తి, మరో నలుగురిపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. పండ్లూరు గ్రామ సమీపంలో జాతీయ రహదారి పక్కనే ఎకో కేర్ మేకింగ్ పేరుతో వెయిట్ లెస్ బ్రిక్స్ పరిశ్రమ ఉంది. అందులో ప్రకాశం జిల్లా కొప్పోలు గ్రామానికి చెందిన కాట్రగడ్డ సురేష్ 2022లో మేనేజర్‌గా చేరాడు. దొంగ బిల్లులతో మెటీరియల్ కొనుగోళ్లలో మోసానికి పాల్పడ్డాడు. రెండేళ్లుగా పరిశ్రమకు నష్టాలు వస్తుండడంతో యజమానులు గుర్తించారు. దీంతో గతంలో పనిచేసిన మేనేజర్‌తో పాటు పరిశ్రమలో పనిచేస్తున్న జలీల్, ఇమామ్ ఆలీ, శాంతకుమార్, దయాకర్ కలిసి మొత్తం రూ.2.16 కోట్లు స్వాహా చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై సీఐ బాబీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా మట్టి తవ్వకాలు

పెళ్లకూరు: మండలంలోని రోసనూరు కేంద్రంగా చెరువుల్లో మట్టిని యంత్రాలతో తవ్వి లారీలతో అక్రమంగా ఇటుకబట్టీలకు తరలించి, ఓ టీడీపీ నేత జేబులు నింపుకుంటున్నాడు. మండల కేంద్రానికి మారుమూల ప్రాంతం కావడంతో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అధికారాన్ని అడ్డం పెట్టుకుని చెరువుల్లో మట్టి అక్రమ తవ్వకాలు చేపట్టి లారీలతో ఇటుక బట్టీలకు రవాణా చేస్తున్నాడు. మట్టికి మంచి గిరాకీ ఉండడంతో దొరవారిసత్రం మంలంలోని పలు ఇటుకబట్టీలకు రాత్రి వేళల్లో అక్రమంగా మట్టి రవాణా జోరుగా సాగుతుంది. అక్రమ మట్టి తవ్వకాలపై స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



మట్టి తవ్వకాలతో రూపు కోల్పోయిన రోసనూరు చెరువు

జాతీయవాద కవిగా బోయి భీమన్న

చిల్లకూరు: దళిత జాతి కోసం జాతీయ వాద కవిగా ఎన్నో రచనలు చేసిన ఘనత డాక్టర్ బోయి భీమన్నకు దక్కుతుందని భారతీయ శిక్షణా మండల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, తెలుగు ఉపాధ్యాయుడు ప్రజేంద్రరెడ్డి కొనియాడారు. మండలంలోని పారిచెర్లవారిపాళెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం డాక్టర్ బోయి భీమన్న 113వ జయంతి వేడుకల్లో ఆయన చిత్ర పటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాషను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరు రచనలు చేసిన మహానుభావులను గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బండ్ల సుధాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బోయి భీమన్న చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

క్రీడాకారుల ఎంపికలు ప్రారంభం

సూళ్లూరుపేట రూరల్: కోటపోలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో మండల స్కూల్ గేమ్స్ ఎంపికలు గురవారం ఘనంగా ప్రారంభించారు. ఈ క్రీడా పోటీలు మండల విద్యాశాఖాధికారి శ్రీనయ్య చేతుల మీదుగా జెండా ఊపి ప్రారభించారు. ఈ నెల 18, 19, 20వ తేదీ వరకు ఉంటాయని క్రీడల సమన్వయకర్త పీఈటీ భాస్కర్ తెలిపారు. అండర్ -14, అండర్-17 విభాగాల్లో వాలీబాల్, చెస్, బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్ తదితర పోటీలకు ఎంపికలు నిర్వహించామన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి 300 మంది విద్యార్థులు ఎంపికలకు హాజరయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోటపోలూరు జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.చంద్రజీత్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడా పోటీల ఎంపికలు ప్రారంభిస్తున్న ఎంఈఓ తదితరులు

ఉపాధి హామీలో ఉద్యాన పంటల అభివృద్ధి

సైదాపురం: ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యాన పంటలను అభివృద్ధి చేస్తున్నట్లు డ్వామా పీడీ శ్రీనివాసులు తెలిపారు. మండల కేంద్రమైన సైదాపురంలో గురువారం పలు శాఖల అధికారులతో ఉపాధి పథకం ద్వారా చేపట్టబోయే పనులపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ సైదాపురం మండలానికి 350 ఎకరాల్లో నిమ్మ తోటలను అభివృద్ధి చేసుకునేందుకు ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. ఇప్పటి వరకు 253 ఎకరాల్లో పంటల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపామన్నారు. మిగిలిన 97 ఎకరాలకు కూడా ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఏపీడీ మృదుల, ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్, హెచ్‌ఓ ఆనంద్, ఏఓ హైమావతి తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం

వెంకటగిరి(సైదాపురం): పట్టణంలోని విశ్వోదయ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థులు గురువారం సమావేశమయ్యారు. 1979-82వ సంవత్సరం విద్యార్థులంతా ఆ కళాశాలలో కలసి అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పటి అధ్యాపకులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. మృతి చెందిన తోటి విద్యార్థులను గుర్తుచేసుకుని సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమ నిర్వాహకులుగా పేట మురళీరెడ్డి, పల్లెటి బాలాజీ వ్యవహరించారు.



విశ్వోదయ పూర్వ విద్యార్థులు

క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి

నాయుడుపేట టౌన్: విద్యతోపాటు క్రీడలకు సైతం విద్యార్థులు ప్రాధాన్యమివ్వాలని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో గురువారం మండల స్థాయి క్రీడాపోటీలను అధికారులు, నాయకులతో కలిసి నెలవల ప్రారంభించారు. ముందుగా జరిగిన సమావేశంలో పాల్గొని, విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం మండల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల నుంచి క్రీడా పోటీలకు వచ్చిన విద్యార్థులను పరిచయం చేసుకున్నారు. ముందుగా జరిగిన కబడ్డీ పోటీలను నెలవల టాస్ వేసి ప్రారంభించారు. షాట్ పుట్ తదితర క్రీడలను ఆడి విద్యార్థులను ఉత్సాహపరిచారు. ఎంఈఓ మునిరత్నం మాట్లాడుతూ గురు, శుక్రవారాలు రెండు రోజులపాటు పోటీలు జరుగుతాయన్నారు. గెలుపొందిన వారికి నియోజకవర్గ, జిల్లా స్థాయి పోటీలను సైతం ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, నాయకులు ఎస్.విజయభాస్కర్‌రెడ్డి, సన్నారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పసల గంగాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినుల కబడ్డీ పోటీలు

గంగ జలాలు చెరువులకు విడుదల చేయాలి

పెళ్లకూరు: తెలుగుగంగ జలాలను చెరువులకు విడుదల చేసి రబీ సాగుకు ఉపయోగకరంగా చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ రైతు సంఘాల సమాఖ్య కార్యదర్శి చింతంరెడ్డి రాజశేఖర్‌రెడ్డి కోరారు. సూళ్లూరుపేటలోని స్థానిక ఆర్డీవో చంద్రమునిని కలిసి వినతి పత్రం అందించారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులతో మండలంలోని చెరువుల్లో చుక్కనీరు లేకుండా ఎండిపోయి ఉన్నాయని, వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్నప్పటికీ దుక్కిపనులు, నారుమడులు సిద్ధం చేసుకునేందుకు ఇబ్బందిగా ఉన్నట్లు వివరించారు. ప్రస్తుతం గంగ జలాలను చెన్నైకి విడుదల చేసిన తరుణంలో 7వ బ్రాంచ్ కాలువ ద్వారా పునబాక, చెంబేడు, అర్ధమాల, బంగారంపేట, పెళ్లకూరు, చిల్లకూరుతోపాటు స్వర్ణముఖి సిస్టమ్ కింద కలవకూరు, పాలచ్చూరు తదితర చెరువులకు గంగ జలాలను సరఫరా చేయాలని విన్నవించారు. స్పందించిన ఆయన రైతుల అభ్యర్థనను పరిశీలించి గంగ జలాలు విడుదలకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు.



ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న రాజశేఖర్‌రెడ్డి

అధికారులు పూర్తి సమాచారంతో రావాలి

కలువాయి: మండల సభకు వచ్చే అధికారులు తమ శాఖ పరిధిలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధి పనులపై పూర్తిస్థాయి సమాచారంతో హాజరు కావాలని జెడ్పీటీసీ సభ్యులు బి.అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. కలువాయి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అన్ని శాఖలో అధికారుల బదిలీల ప్రక్రియ కొనసాగుతోందని, మలివిడత సమావేశానికి అన్ని శాఖల అధికారుల తమ పరిధిలో జరుగుతున్న పనులపై పూర్తి వివరాలతో సమావేశానికి రావాలన్నారు. ఉపాధిహామీ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య ఆరోగ్య తదితర శాఖలపై సమీక్ష నిర్వహించారు. ఎంపీపీ ఆర్.లక్ష్మీదేవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉపాధ్యక్షులు పంగ పెంచల నరసారెడ్డి, ఎంపీడీఓ గోవర్ధన్, ఇతర శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు బి.అనిల్‌కుమార్ రెడ్డి

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలి

గూడూరు రూరల్: కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు కావస్తున్నా కౌలు రైతులకు ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని, వెంటనే వారి సమస్యలు పరిష్కరించాలని గూడూరు డివిజన్ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేవారు. రెవెన్యూ కార్యాలయంలో గురువారం రైతు సంఘం నాయకులు డిప్యూటీ తహసీల్దార్ సురేంద్రను కలసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ సీజన్ ఆరంభమవుతున్నా ప్రభుత్వం ఇప్పటి వరకు పెట్టుబడి సాయం అందించలేదని తెలిపారు. అలాగే రైతుల రుణాలను రూ.రెండు లక్షల వరకు రద్దు చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేసి జీఓ నెంబర్ 22 రద్దు చేయాలని అన్నారు. రైతు నాయకులు జోగి శివకుమార్, బీవీ రమణయ్య, ఎస సురేష్, అడపాల ప్రసాద్, యద్దల మురళీమోహన్‌రెడ్డి, బత్తిన శ్రీనివాసులు, బి.చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



డీటీకి వినతి పత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

మొక్కలు నాటాలి

ఓజిలి: పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరు విరివిగా మొక్కలు నాటాలని ఎంపీడీఓ రజనీకాంత్ అన్నారు. మండలంలోని పెదపరియ గ్రామంలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా చెత్తసంపద కేంద్రం వద్ద గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అడవులు, మొక్కలను ఎక్కువగా నరికివేయడతో పరిసరాలు కాలుష్యకోరల్లో చిక్కుకుపోతాయన్నారు. గ్రామాల్లోలో చెత్తాచెదారాలను చెత్తసంపద కేంద్రాలకు తరలించి పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలలో పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలియజేశారు. అనంతరం చిలమానుచేను గ్రామంలో విద్యార్థులతో మానవహారం నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పారిచర్ల సాయిరాం, ఈఓపీఆర్డీ మోహన్, పంచాయితీ కార్యదర్శులు మస్తానయ్య, దీపా, హెచ్‌ఎం అనసూయ తదితరులు పాల్గొన్నారు.



చిలమానుచేనులో ఉన్నత పాఠశాలలో ర్యాలీ

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం

దక్కిలి: చిన్నారులకు పౌష్టికాహారం అందించడం ద్వారా రక్తహీనతను దూరం చేయవచ్చునని వెంకటగిరి ఐసీడీఎస్ సీడీపీఓ శంషాద్‌బేగం తెలిపారు. మండలంలోని నాయుడుపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ అంగనావాడీల్లో పిల్లలకు పోషకాహారం అందిస్తున్నట్లు తెలిపారు. పిల్లల్లో పోషకాహార లోపం తలెత్తకుండా చూసుకోవాలన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు కల్పలత, పరిమళ, టీచర్లు లీలా, త్రివేణి, వెంకటమ్మ, శైలజ, సుబ్బమ్మ, అంకమ్మ ఉన్నారు.

పౌష్టికాహార ప్రాముఖ్యతపై అవగాహన

నాయుడుపేట టౌన్: పోషకాహార ప్రాముఖ్యతపై అవగాహన కల్పించేలా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ ఉమామహేశ్వరి తెలిపారు. పట్టణంలోని ఎల్‌ఏ సాగరం పాఠశాలలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం సీడీపీఓ సారథ్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ ప్రాజెక్టు పరిధిలోని నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నెల రోజులపాటు పోషక ఆహారం అవశ్యతకపై అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు. అంగన్‌వాడీ కేంద్రం వద్ద జరిగిన కార్య క్రమంలో సూపర్‌వైజర్ ఆషా బేగం, మూడు అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.



పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ

గర్భవతులకు సీమంతం

రాపూరు: గర్భవతులు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవడంతో రక్తహీనత దూరమవుతుందని అంగన్‌వాడీ సీడీపీఓ సునందన పేర్కొన్నారు. రాపూరు మండలం రామకూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా సామూహిక సీమంతాలు నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.